

చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం పలికాయి.



నార్లు నేరుగా నాటుకోవద్దు

నర్సరీల్లో సేకరించిన నార్లను రైతులు నేరుగా పొలాల్లో నాటుకోవడం వల్ల తెగుళ్లు ఆశించే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు.

8లో

గరిష్టం/కనిష్టం
36.6°/22.9°

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జీజీహెచ్‌లో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ప్రారంభం



ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మంగళవారం ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాన్ని ప్రారంభించారు. గతంలో ఉన్న క్యాజువాలిటీనే ఎమర్జెన్సీ మెడిసిన్‌గా మార్పు చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సత్వర వైద్యం అందించేందుకు ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ఉపయోగపడుతుందన్నారు. డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ నూరుల్లాఖాన్, కల్యాణ్ తదితరుల పర్యవేక్షణలో రోగులకు వైద్య సేవలందుతాయన్నారు. క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు(సీఎంఓ) ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి పరిధిలో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ బీమసేనాచార్, సర్జన్ డాక్టర్ మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మద్యం సేవించి వాహనాలు నడిపే వారిమీద కేసులు నమోదు చేసి జైలు శిక్ష పడేట్టు చేయాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను ఒక కమిటీ ద్వారా గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. హెల్మెట్ ధరించని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, రవాణాశాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. ట్రామాకేర్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌ను తక్షణమే నియమించాలన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, హైవేలు, దాబాలు, ఇతర ప్రదేశాల్లో వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారులపై ర్యాష్ డ్రైవింగ్, అతివేగంగా వెళ్లే వాహనాలతో అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని, నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి కరుణ సాగర్ రెడ్డి, ఎంవీఐ నాగేంద్రనాయక్, ఏడీ రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్లు రంగస్వామి, కిరణ్‌కుమార్, వంశీకృష్ణ భార్గవ పాల్గొన్నారు.

వందనం.. అనుమానం!

మేం అధికారంలోకి వస్తే 'అమ్మకు వందనం' పథకం కింద ఇంట్లో ఎంత మంది పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వెళ్లి చదువుకుంటే అంత మందికీ ఏటా రూ.15 వేలు అందిస్తాం.

– ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ ఇది.

'అమ్మకు వందనం'పై ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనా లేదు. అసలు విధి విధానాలే ఖరారు కాలేదు. ఎవరికిస్తుంది...ఎంత ఇస్తుందన్న విషయం మాకు తెలియదు.

– పాఠశాలలు పునఃప్రారంభమైన 18 రోజుల తర్వాత కూడా అధికారులు చెబుతున్న మాటలివి.

- పాఠశాలలు పునఃప్రారంభమైనా పథకం ఊసేలేదు
- గత ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా 'అమ్మఒడి'
- పథకం పేరును 'అమ్మకు వందనం'గా మార్చిన చంద్రబాబు సర్కార్
- నేటికీ విధి విధానాలు ఖరారు చేయని వైనం
- సొమ్ము కోసం ఆశగా ఎదురుచూస్తున్న విద్యార్థుల తల్లులు



పుట్టపర్తి: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన జగన్ సర్కార్... 'అమ్మఒడి' పథకం ద్వారా ఎందరో విద్యార్థులను బడిబాట పట్టించింది. జగనన్న విద్యాకానుక, అమ్మఒడితో పేదింట చదువులకు ఎలాంటి ఇబ్బందులు లేకపోవడంతో లక్షలాది మంది తల్లిదండ్రులు తమ పిల్లలను చక్కగా బడులకు పంపారు. జగన్‌మోహన్ రెడ్డి హయాంలో నాలుగు విడతలు విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అమ్మఒడి నిధులు నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేశారు. కానీ ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పథకం అమలు అవుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాకు రూ.946 కోట్లు

వైఎస్ జగన్ హయాంలో ఒక్క శ్రీసత్యసాయి జిల్లాలోనే 'అమ్మఒడి' పథకం కింద 1,66,398 మంది లబ్ధి పొందారు. ఒక్కో విద్యార్థి తల్లి ఖాతాలో రూ.15 వేల చొప్పున మొత్తం రూ.946.49 కోట్లు జమ చేశారు.

'అమ్మకు వందనం' అంటూ ఆశలు రేపి..

ఎన్నికల సమయంలో చంద్రబాబు 'అమ్మఒడి' తరహాలోనే 'అమ్మకు వందనం' అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అమ్మఒడికి మించి కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అందరికీ రూ.15 వేల చొప్పున నేరుగా తల్లుల ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చాక ఇంత వరకూ ఎక్కడా ఈ పథకం గురించి ప్రస్తావించ లేదు. పాఠశాలలు పునఃప్రారంభమైనా ఈ ఊసేలేదు. ఇప్పటివరకూ కనీసం విధి విధానాలు కూడా రూపొందించలేదు. దీంతో 'అమ్మకు వందనం' ఏమో కాని దండం పెడతారేమోనని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు.

నేటికీ పథకం అమలు ఊసే లేదు

ప్రస్తుతం జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 2,37,000 మంది విద్యార్థుల చదువుకుంటుండగా... 'అమ్మకు వందనం' పథకం కింద ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున సుమారు రూ.355 కోట్లు చంద్రబాబు ప్రభుత్వం తల్లుల ఖాతాల్లోకి జమ చేయవలసి ఉంది. కానీ 'అమ్మకు వందనం' పథకం అమలు గురించి ఏ ఒక్కరూ మాట్లాడటం లేదు. దీంతో విద్యార్థుల తల్లులు ఫీజులు, పుస్తకాలు, ఇతరత్రా వాటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

'అమ్మఒడి' ద్వారా గతంలో జిల్లాలో లబ్ధి పొందిన వారి వివరాలు

విద్యా సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	జమ చేసిన మొత్తం (రూ.కోట్లలో)
2019-20	1,62,574	243.86
2020-21	1,61,554	242.33
2021-22	1,66,398	249.60
2022-23	1,62,080	210.70
మొత్తం	1,66,398	946.49

జిల్లాలో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు..

	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
ప్రభుత్వ పాఠశాలలు	2,078	1,47,000
ప్రైవేట్ పాఠశాలలు	430	80,000
జూనియర్ కళాశాలలు	113	10,000

విధి విధానాలు రూపొందించాల్సి ఉంది



నూతన ప్రభుత్వం అమలు చేయనున్న 'అమ్మకు వందనం' పథకానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి విధి విధానాలు ఖరారు కాలేదు. ఉన్నతాధి కారుల నుంచి వచ్చే ఆదేశాల మేరకు పథకం అమలుకు సంబంధించి చర్యలు తీసుకుంటాం.

– మీనాక్షి, జిల్లా విద్యాశాఖ అధికారి

ప్రైవేటుకు అమలు చేస్తారో లేదో..?



జగన్ ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థులందరికీ 'అమ్మఒడి' పథకాన్ని అందించి చదువులకు భరోసా ఇచ్చింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇప్పటి దాకా ఎలాంటి ప్రకటనా చేయలేదు. ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థులకు పథకం వస్తుందా..రాదా అన్నది తెలియడం లేదు. నేనైతే అమ్మఒడి తరహా ఆర్థిక చేయూత అందుతుందనే నా బిడ్డను ప్రైవేటు పాఠశాలలో చేర్పించా. ఇప్పుడు నిబంధనలతో కోత పెడితే ఏం చేయాలో తెలియడం లేదు.

– కుమ్మరి అరుణమ్మ, పగడాలవారిపల్లి, ఓడీ చెరువు మండలం

గతంలో ఈపాటికే జమయ్యేది



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంట్లో ఎంత మంది చదువుతున్నా అందరికీ రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాల్లో వేస్తామని, అమ్మకు వందనం పథకం కింద జమ చేస్తామన్నారు. ఇప్పటి దాకా ఆ ఊసే లేదు. గతంలో జగన్ ప్రభుత్వం విద్యా సంవత్సరం ఆరంభంలోనే వరుసగా నాలుగేళ్లు ఒక్కో సంవత్సరం రూ.15 వేల చొప్పున మా ఖాతాల్లో జమ చేసింది. దీంతో పిల్లల చదువుల భారం మాపై పడేది కాదు.

– పేట గంగమ్మ, విద్యార్థి తల్లి, రెడ్డి వారిపల్లి అమడగూరు మండలం

డయేరియా నిర్మూలనకు పాటుపడదాం



పెనుకొండలో 'స్టాప్ డయేరియా' కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్ఓ మంజువాణి

పెనుకొండ: డయేరియా నిర్మూలనకు ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది కృషిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) మంజువాణి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మంగళవారం వైద్యాధికారి సాయిసౌమ్య నేతృత్వంలో 'స్టాప్ డయేరియా'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. స్టాప్ డయేరియా కార్యక్రమం ఆగస్ట్ 2వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి 6 నెలల నుంచి ఐదేళ్ల వయస్సు పిల్లలున్న తల్లులకు అతిసారంపై అవగాహన కల్పించాలన్నారు. మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో జబ్బులు ప్రబలే అవకాశం ఉందని, అందువల్ల ఆశా వర్కర్లు, సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేయాలన్నారు. అనంతరం అతిసారం నుంచి మీ పిల్లలను రక్షించాలన్న ఫ్లెక్సీలను ఆవిష్కరించారు.

ఐఏఎస్‌లే ఆయన్ను 'పెద్దాయన' అంటారు

- రమణారెడ్డి పదవీ విరమణ సన్మానసభలో కలెక్టర్ అరుణ్‌బాబు



రమణారెడ్డితో తనకున్న అనుబంధాన్ని వివరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

కదిరి: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికీ పదవీ విరమణ తప్పదని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. తిరుపతి కలెక్టర్‌గా పని చేసి రెండు రోజుల క్రితం పదవీ విరమణ పొందిన ఐఏఎస్ అధికారి కడపల వెంకట రమణారెడ్డి పదవీ విరమణ సన్మాన సభ మంగళవారం కదిరిలో ఆయన స్వగృహం వద్ద కదిరి ప్రాంతానికి చెందిన ఆయన ఆత్మీయులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ..'రమణారెడ్డి కుటుంబంలో నేను కూడా ఒకన్ని. నేను ఐఏఎస్ కాకముందు ఇద్దరం ఒకే రూంలో ఉండేవాళ్లం. నేను కలెక్టర్ హోదాలో ఇక్కడ మాట్లాడుతున్నానంటే దానికి కారణం రమణారెడ్డి అన్న. ఆయన్ను ఐఏఎస్ హోదాలో ఉన్న మా మిత్రులందరూ ఎంతో ముద్దుగా 'పెద్దాయన' అని పిలుస్తాం. మేము ఎంత కామిడీ చేసినా ఆయన మమ్మల్ని అంతే ప్రేమగా చేరదీస్తారు. ఆయన పదవీ విరమణ సన్మాన సభకు నేను రావడం నాకు ఎంతో గర్వకారణం' అన్నారు. సన్మాన గ్రహీత రమణారెడ్డి మాట్లాడుతూ.. తాను ఈ స్థాయికి రావడానికి తన భార్యతో పాటు తల్లిదండ్రులే కారణమన్నారు. పదవీ విరమణ తర్వాత కదిరిలో స్థిరపడాలని ఇల్లు కట్టుకున్నానన్నారు. అనంతరం ఆయన్ను కలెక్టర్‌తో పాటు పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కదిరి ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ, విశ్రాంత జేసీ రామమూర్తి, ఏపీపీఎస్సీ మెంబర్ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌గా టీఎస్ చేతన్

- పల్నాడు కలెక్టర్‌గా అరుణ్‌బాబు బదిలీ



నూతన కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లా నూతన కలెక్టర్‌గా టీఎస్ చేతన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబును పల్నాడు కలెక్టర్‌గా బదిలీ చేశారు. అరుణ్‌బాబు 2023 ఏప్రిల్ 10వ తేదీన జిల్లాకు రెండో కలెక్టర్‌గా నియమితులయ్యారు. అనతి కాలంలోనే పాలనలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారు. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించి గుర్తింపు తెచ్చుకున్నారు. నూతన కలెక్టర్ టీఎస్ చేతన్‌కు జిల్లా గురించి పూర్తి అవగాహన ఉంది. గతంలో ఆయన జాయింట్ కలెక్టర్‌గా సుమారు 20 నెలల పాటు విధులు నిర్వర్తించారు. గత ఏడాది డిసెంబర్‌లో ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా బదిలీపై వెళ్లారు. తిరిగి జిల్లా కలెక్టర్‌గా వస్తున్నారు. కాగా చేతన్ జిల్లాకు మూడో కలెక్టర్ కాగా, జిల్లా ఆవిర్భావం తర్వాత బసంత్‌కుమార్, ఆ తర్వాత అరుణ్‌బాబు కలెక్టర్లుగా పనిచేశారు.

'డైట్'లో అట్టహాసంగా ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న బాలికలు

పుట్టపర్తి: బుక్కపట్నంలోని జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో మంగళవారం ఫ్రెషర్స్‌డే అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ రవిసాగర్ హాజరయ్యారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, 'డైట్' విద్యాలయం ఛాత్రోపాధ్యాయులకు దేవాలయమని, ఇక్కడి శిక్షణ పొందిన వేలాది మంది ఉపాధ్యాయులుగా రాణిస్తూ ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. అనంతరం మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు రెండో సంవత్సరం పూర్తి చేసుకునే విద్యార్థులు స్వాగతం పలికారు. అంతకుముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దేశభక్తి గీతాలు, సినిమా పాటలకు నృత్యాలు చేస్తూ అమ్మాయిలు అలరించారు.

ఖరీఫ్.. చీడలతో ఖిల్లాస్

- పంటలను తినేస్తున్న చీడపీడలు
- సతమతమవుతున్న రైతులు
- మందులు పిచికారీ చేసినా ఫలితం శూన్యం
- తడిసి మోపెడవుతున్న ఖర్చులు

పుట్టపర్తి అర్బన్: అరకొర వర్షాలతోనే వరుణుడు సరిపెట్టినా... సాగుపై మమకారం చంపుకోని రైతన్నలు ఖరీఫ్ పంటల సాగుకు ఉత్సాహంగా సిద్ధమయ్యారు. అరకొర నీటితోనే పంటలను ప్రాణంలా కాపాడుకున్నారు. అయితే చీడపీడలు ఎడాపెడా దాడి చేస్తుండడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

వేరుశనగకు పచ్చ పురుగు

ముందస్తు వర్షాలతో చాలా మంది ముందుగానే విత్తనాలు వేశారు. దీంతో పాటు బోరుబావుల కింద సాగులో ఉన్న రైతులు పలు రకాల ఉద్యాన పంటలు సాగుచేశారు. అయితే సాగు చేసిన వారం రోజుల నుంచే మందులు పిచికారీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ సీజన్‌లో పెద్ద ఎత్తున సాగు చేసే వేరుశనగ పంటకు చీడపీడలు చుట్టుముట్టాయి. ఇక కూరగాయల పంటలకు సైతం ప్రారంభం నుంచే మందులు పిచికారీ చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. వేరుశనగ విత్తనం వేసిన 15 రోజులకే శనగ పచ్చ పురుగు, అనంతరం లద్దె పురుగు, గొంగళి పురుగు, నల్లచీడ వంటివి ఆశించడంతో వేరుశనగ ఆకులను నలిమేస్తున్నాయి. పంట పూత దశ వచ్చే సమయానికి రెండు నుంచి మూడు సార్లు మందులు పిచికారీ చేయాల్సి వస్తోందని, దీంతో సాగు ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

పెరిగిన ఖర్చు

ఎక్కువ విస్తీర్ణంలో పొలం ఉన్న రైతులు ప్రభుత్వం గరిష్టంగా ఇచ్చే 3 బస్తాల విత్తన వేరుశనగకు తోడు ప్రైవేటు వ్యక్తుల వద్ద విత్తనం కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఇందుకోసం కిలో విత్తనానికి రూ.125 నుంచి రూ.140 వరకూ వెచ్చించారు. ట్రాక్టర్ బాడుగ, గుంటక, విత్తనాల విత్తడం, ఎరువులు, కలుపు తీయడం, పురుగు మందుల పిచికారీ తదితర వాటికి ఎకరాకు ఎంతలేదన్నా... రూ.30 వేలకు పైగా ఖర్చు వస్తోంది. ఇక పంట తొలగించే సమయానికి మరో రూ.10 వేలు ఖర్చు వస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం చీడపీడలు పంటను ఆశించడంతో పురుగుమందును రెండు నుంచి మూడుసార్లు పిచికారీ చేయాల్సి వస్తోంది. మరోవైపు ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు రైతులు అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఒక మందు అడిగితే మరో రెండు రకాల మందులు కలిపి విక్రయిస్తున్నారు. అవి పనిచేయకపోవడంతో మళ్లీ మళ్లీ మందు పిచికారీ చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శనగ పచ్చ పురుగు

వేరుశనగ, కంది తదితర పంటలు సాగుచేసిన 15 రోజులకే శనగపచ్చ పురుగు దాడి చేస్తోంది. ఆకు తింటూ చెట్టు పెరుగుదలకు అడ్డంకిగా మారింది. ఈ పురుగు ఉదయం, సాయంత్ర వేళల్లో మాత్రం లేత ఆకులను, చిగుళ్లు తింటూ ఉంటుంది. దీంతో మొక్క పెరుగుదలపై తీవ్ర ప్రభావం పడుతోంది.



లద్దె పురుగు

లద్దెపురుగు పగలంతా భూమిలోకి వెళ్లి రాత్రి పూట పంట ఆకులను అడ్డదిడ్డంగా తింటూ నష్ట పరుస్తోంది. అలాగే పూతను సైతం తినేస్తుంది. పగటి పూట మందులు పిచికారీ చేసినా... రాత్రి మొక్క తినే సమయంలోనే మందు ప్రభావంతో ఈ పురుగు నశిస్తుంది.

గొంగళి పురుగు

ఇది వేరుశనగ మొక్కలతో పాటు గట్లపైన ఉన్న గడ్డిని తింటుంది. పొలానికి మందులు పిచికారీ చేసినా పక్క పొలం బీడుగా ఉంటే చాలు అక్కడి నుంచి వచ్చి దాడి చేస్తుంది. పొలానికి చుట్టూ మేరసాల్లు వేయడంతో ఈ పురుగును అరికట్టవచ్చు. ఈ పురుగులతో పాటు నల్లచీడ సైతం వ్యాపిస్తుంది.

సరైన మందులు ఇవ్వాలి



ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు వ్యవసాయాధికారులు సూచించిన మందులతో పాటు ఇతర మందులను రైతులకు అంటగట్టి వ్యయం పెంచుతున్నారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా వ్యవసాయాధికారులే చర్యలు తీసుకోవాలి. రైతులకు కావాల్సిన మందులు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలి.

– మనోహర్‌రెడ్డి, రైతు, కొత్తచెరువు మండలం

సూచనల మేరకే వాడాలి

ఏ పంటలకైనా వ్యవసాయాధికారులు సూచించిన మందులను మాత్రమే పిచికారీ చేసుకోవాలి. అనుమతి ఉన్న ఫర్టిలైజర్ షాపుల్లోనే మందులు కొనుగోలు చేయాలి. వేరుశనగ విత్తనాలను ట్రైకోడెర్మా విరిడి మందుతో శుద్ధి చేసుకోవాలి. రసం పీల్చే పురుగు ఉధృతిని బట్టి ఇమిడాక్లోప్రిడ్ మందును 0.3 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లద్దె పురుగు, పచ్చ పురుగు చిన్నవిగా ఉంటే వేపనూనెకు క్వినాల్‌ఫాస్ మందును లీటరు నీటికి 2 ఎంఎల్ మందును కలిపి పిచికారీ చేయాలి. పెద్దపురుగులు ఉంటే తయోడీకార్బ్‌కు నవలురాన్ మందును కలిపి లీటరు నీటికి 0.4 ఎంఎల్ మందును కలిపి పిచికారీ చేయాలి. పొలంలో జిగట అట్టలు, లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకుంటే మంచిది.

– రామసుబ్బయ్య, ఏరువాక శాస్త్రవేత్త, పుట్టపర్తి

క్లుప్తంగా

కదిరి వాసికి జ్యువెల్ ఆఫ్ ఇండియా అవార్డు



వీరాస్వామి

కదిరి అర్బన్: ప్రతిష్టాత్మకమైన జ్యువెల్ ఆఫ్ ఇండియా అవార్డును స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ వేముల వీరాస్వామి అందుకున్నారు. సాంకేతిక విద్యారంగ వ్యవస్థను అన్ని కోణాల్లో సంరక్షిస్తూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యుత్తమ విద్యనందిస్తూ, ఉత్తమ ఫలితాలు సాధిస్తూ, భావితరాలకు ఉత్తమ పౌరులను అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రకటించినట్లు న్యూఢిల్లీకి చెందిన కేటీకే అవుట్‌స్టాండింగ్ అచీవర్స్ అండ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చైర్మన్ మేజర్ యశ్‌పాల్‌సింగ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని తపాలా ద్వారా మంగళవారం వీరాస్వామి అందుకున్నారు.

యువకుడి దుర్మరణం

తలుపుల: ఐచర్ వాహనం ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరిలోని నిజాంవలి కాలనీకి చెందిన గంగయ్య కుమారుడు శేషాద్రి (27) జియో సంస్థలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం గాండ్లపెంట నుంచి తలుపులకు స్కూటీపై వస్తుండగా పల్లవాండ్లపల్లి సమీపంలో మలుపు వద్ద ఐచర్ వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన శేషాద్రిని వెంటనే తలుపులలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రోకలితో భార్యపై దాడి

ఎన్‌పీకుంట: క్షణికావేశంలో రోకలితో భార్యపై దాడి చేసిన ఘటన ఎన్‌పీకుంట మండలం ఎగువతూపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు... ఎగువతూపల్లి గ్రామానికి చెందిన మల్లిరెడ్డి, రాజేశ్వరి దంపతులు. కొన్ని రోజులుగా దంపతులు తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో పెద్దమనుషులు జోక్యం చేసుకుని ఇద్దరినీ రాజీ చేశారు. మంగళవారం ఉదయం చిన్నపాటి విషయానికి దంపతులు మరోసారి గొడవ పడ్డారు. ఆ సమయంలో క్షణికావేశానికి లోనైన మల్లిరెడ్డి పక్కనే ఉన్న రోకలితో భార్య తలపై మోదాడు. తీవ్ర రక్తగాయమైన రాజేశ్వరిని కుటుంబసభ్యులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ఘటనపై విచారణ చేపట్టి, కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.








● బటర్‌ఫ్లై.. బటర్‌ఫ్లై... వేర్ ఆర్‌యూ గోయింగ్

'బటర్‌ఫ్లై.. బటర్‌ఫ్లై... వేర్ ఆర్‌యూ గోయింగ్' అంటూ రైమ్ వినగానే చిన్నారులే కాదు పెద్దలు సైతం లయబద్ధంగా చేతులు గాలిలో ఆడిస్తూ సంబరపడిపోతుంటారు. అంతటి ఆహ్లాదాన్ని పంచే రంగురంగుల సీతాకోకచిలుకలు పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో ఎగురుతూ వయస్సుతో సంబంధం లేకుండా అందరికీ కనువిందు చేస్తున్నాయి. – పుట్టపర్తి రూరల్:



'విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి'



పోస్టర్లను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 4న తలపెట్టిన దేశ వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జిల్లాలోనూ విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఏ, పీడీఎస్‌యూ, ఎన్‌యూఎస్‌ఐ జాతీయ ఐక్య విద్యార్థి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం పుట్టపర్తిలోని సీపీఐ కార్యాలయంలో విడుదల చేసి, మాట్లాడారు. జాతీయ స్థాయిలో ఉన్నత విద్యలో ప్రవేశాలకు పోటీ పరీక్ష నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అన్నింటా విఫలమైందని మండిపడ్డారు. నీట్ స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్డీఏ పాలనలో విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో కోత విధించడమే కాక, పాఠశాలలు తగ్గించడం, కొన్ని పాఠశాలలు మూత వేయడం జరిగిందన్నారు. దేశంలో విద్య, ప్రజాస్వామ్యంపై జరుగుతున్న అనైతిక దాడికి వ్యతిరేకంగా ఐక్య విద్యార్థి సంఘాల పిలుపు మేరకు ఈ నెల జిల్లాలో కేజీ నుంచి పీజీ వరకూ విద్యాసంస్థలను బంద్ చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు నల్లజోడు పవన్, వీరేష్, నాగార్జున, శివకుమార్, రంజిత్, ప్రసాద్, సాయినాథరెడ్డి, నరేష్, నవీన్, ప్రతాప్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

పావగడ: అత్తింటి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం గౌరవనహళ్లి గ్రామానికి చెందిన చన్నరాయుడు కుమార్తె లక్ష్మీదేవి (25)కి మూడేళ్ల క్రితం పావగడ తాలూకా వీర్లగొంది గ్రామానికి చెందిన ప్రసన్నకుమార్‌తో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా లక్ష్మీదేవితో అత్త సువర్ణమ్మ, మామ కృష్ణప్ప తరచూ గొడవ పడి పుట్టింటికి పంపేవారు. విషయం తెలుసుకున్న భర్త ప్రసన్నకుమార్ వెంటనే గౌరవనహళ్లికి వెళ్లి తన భార్యకు నచ్చచెప్పి కాపురానికి పిలుచుకు వచ్చేవాడు. మంగళవారం అత్తింటి వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో జీవితంపై విరక్తి చెందిన లక్ష్మీదేవి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ప్రసన్నకుమార్; సువర్ణమ్మ, కృష్ణప్పపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి



మృతురాలు నేత్ర

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీరంగాపురం క్యాంపు గ్రామానికి చెందిన వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని చెళ్లకెర తాలూకా భోగనహళ్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవమ్మ, తిప్పేస్వామి దంపతుల కుమార్తె నేత్ర (30)కు 2015లో బొమ్మనహాళ్ మండలం శ్రీరంగాపురం క్యాంపు గ్రామానికి చెందిన టి.వెంకటేశులుతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంత కాలంగా పుట్టింటికి వెళ్లి డబ్బు తీసుకురావాలంటూ నేత్రను భర్తతో పాటు అత్త లక్ష్మి, ఆడపడచు గాయత్రి వేధించసాగారు. ఈ క్రమంలో పలుమార్లు ఆమెను తీవ్రంగా కొట్టేవారు. ఈ క్రమంలోనే సోమవారం నేత్ర మృతి చెందింది. సమాచారం అందుకున్న మృతురాలి కుటుంబసభ్యులు శ్రీరంగాపురం క్యాంపు గ్రామానికి చేరుకుని పరిశీలించారు. భర్త తీవ్రంగా కొట్టడం వల్లనే నేత్ర మృతి చెందిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై మృతురాలి తల్లి లక్ష్మీదేవమ్మ అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

సత్యసాయి భక్తురాలి ఔదార్యం



సైకిళ్లు పంపిణీ చేస్తున్న సుందరవల్లి, పాఠశాల సిబ్బంది

పుట్టపర్తి: జిల్లా కేంద్రం పుట్టపర్తికి చెందిన సత్యసాయి భక్తురాలు సుందరవల్లి తన ఔదార్యాన్ని చాటుకుంది. కొత్తచెరువు మండలం కేశాపురం ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న 8 మంది విద్యార్థులకు రూ. 60 వేలు విలువ చేసే సైకిళ్లను ఉచితంగా అందజేసింది. ఈ మేరకు ఆ పాఠశాల హెచ్‌ఎం రియాజ్ మంగళవారం తెలిపారు. ఇందుకు కారకుడైన విశ్రాంత ఉపాధ్యాయుడు చెన్న కృష్ణారెడ్డితో పాటు సుందరవల్లిని ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రాభివృద్ధికి కృషి చేద్దాం



వెంకటాపురంలో పర్యటిస్తున్న మంత్రులు సత్యకుమార్, సవితమ్మ, ఎమ్మెల్యే సునీత తదితరులు

రామగిరి: రాష్ట్ర అభివృద్ధికి కృషి చేద్దామని ఏపీ విద్య, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం రామగిరి మండలం వెంకటాపురంలో వారు పర్యటించారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, తనయుడు పరిటాల శ్రీరామ్ స్వాగతం పలికారు. రవి ఘాట్‌ను సందర్శించిన అనంతరం మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మాజీ నక్సలైట్ అరెస్ట్

పావగడ: తాలూకాలోని తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన వెంకటమ్మనహళ్లిలో జవాన్ల శిబిరంపై దాడి చేసి, 9 మంది సైనికుల మృతికి కారణమైన కేసులో నిందితుడిగా ఉన్న నక్సలైట్ (ప్రస్తుతం మాజీ)ను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కేశవాపురం గ్రామానికి చెందిన చంద్రు అలియాస్ ముత్యాలు అప్పట్లో నక్సలైట్ ఉద్యమంలో కీలకంగా పాల్గొన్నాడు. 2005లో పావగడ తాలూకాలోని వెంకటమ్మనహళ్లి గ్రామ సరిహద్దులో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన జవాన్ల శిబిరంపై నక్సలైట్లు విరుచుకుపడ్డారు. ఆ సమయంలో 9 మంది జవాన్లు వీరమరణం పొందారు. ఈ ఘటనలో పాల్గొన్న 32 మంది నక్సలైట్లపై పోలీసులు కేసు నమోదు చేసి, పలువురిని అరెస్ట్ చేశారు. అప్పట్లో పోలీసుల కళ్లు కప్పి తప్పించుకుని తిరుగుతూ జనజీవన స్రవంతిలో కలిసిన వారిలో ఇటీవల కొత్తగేరి శంకర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలోనే మంగళవారం తుమకూరు, బెంగుళూరు అంతరంగిక భద్రత విభాగానికి చెందిన యాంటీ నక్సల్ ఫోర్స్ వల పన్ని చంద్రును అరెస్ట్ చేసింది.

ఈతకు వెళ్లి గల్లంతు

సోమందేపల్లి: మండలంలోని మంచేపల్లిలో బావిలో ఈతకు వెళ్లిన బీహార్‌కు చెందిన సాగర్(35) గల్లంతయ్యాడు. మంగళవారం తన స్నేహితుడితో కలసి ఆయన సరదాగా ఈత కొట్టేందుకు బావి వద్దకెళ్లాడు. అయితే ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టారు.

వీఆర్‌కు సీఐ రియాజ్ అహమ్మద్

హిందూపురం అర్బన్: స్థానిక రెండో పట్టణ సీఐ రియాజ్ అహమ్మద్‌ను వీఆర్‌కు పంపిస్తూ ఎస్పీ మాధవరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, తనను సీఐ రియాజ్ అహమ్మద్ రెండో పెళ్లి చేసుకుని మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడంటూ ఎస్పీ మాధవరెడ్డికి ఇటీవల హిందూపురంలోని ఆబాదు పేటకు చెందిన వివాహిత ఇస్రాత్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయనపై శాఖాపరమైన చర్యలకు ఎస్పీ సిద్ధమైనట్లు తెలుస్తోంది.

నార్లు నేరుగా నాటుకోవద్దు

- ఖరీఫ్ వేరుశనగ, పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- వ్యవసాయ శాస్త్రవేత్తలు విజయశంకర్‌బాబు, నారాయణస్వామి



మిరప నారు



వేరుశనగ



పత్తి

అనంతపురం అగ్రికల్చర్: కూరగాయల పంటలు సాగు చేసే రైతులు వివిధ ప్రాంతాల నర్సరీల నుంచి సేకరించుకున్న నార్లను నేరుగా పొలాల్లో నాటుకోరాదని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకర్‌బాబు, సేద్యపు విభాగపు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి సూచించారు. చాలా మంది రైతులు మిరప, టమాట, వంగ లాంటి కూరగాయల పంటలు సాగులో నార్లను నేరుగా నాటడం వల్ల వివిధ రకాల వైరస్ తెగుళ్లు, చీడపీడలు ఆశించే ప్రమాదం ఉందన్నారు. నార్లు నాటుకునే ముందు తప్పనిసరిగా లీటర్ నీటికి 2.5 మి.లీ క్లోరిఫైరిపాస్, 3 గ్రాముల కార్బండిజమ్ కలిపిన ద్రావణంలో ముంచి నాటుకుంటే ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్నారు.

- ఇక ఖరీఫ్ కింద ముందస్తుగా అక్కడక్కడ సాగు చేసిన వేరుశనగ పంట ప్రస్తుతం శాఖీయ దశలో ఉన్నందున అంతర సేద్యం చేసుకోవాలన్నారు. అలాగే రసంపీల్చు పురుగు, లద్దె పురుగు, శనగపచ్చ పురుగు ఆశించడానికి అనుకూలమైన వాతావరణం ఉన్నందున నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రసంపీల్చు పురుగు ఉధృతిని గమనించేందుకు పొలంలో ఎకరాకు 10 చొప్పున జిగురు పూసిన అట్టలు, మరో నాలుగు ఫిరమోన్ ట్రాప్స్ ఏర్పాటు చేయాలన్నారు.
- వేరుశనగలో పొగాకు లద్దెపురుగు, శనగపచ్చ పురుగు నివారణకు విత్తిన 10 నుంచి 15 రోజుల్లోపు ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసి రెక్కల పురుగులు ఆకర్షించేలా చేయాలన్నారు. అలాగే ఎకరాకు 20 వరకు పక్షి స్థావరాలు ఏర్పాటు చేయాలన్నారు. గుడ్లు, పురుగులు చిన్నవిగా ఉన్నపుడు 5 శాతం వేపగింజల కషాయాన్ని పిచికారీ చేయాలన్నారు. ఉధృతిని బట్టి లీటర్ నీటికి 2 మి.లీ క్వినాల్‌ఫాస్ లేదా 5 మి.లీ వేపనూనె కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. లార్వాలు ఎదిగినట్లు గమనిస్తే... లీటర్ నీటికి 0.4 గ్రాములు ఎమామెక్టిన్ బెంజోయేట్ లేదా 2.5 మి.లీ క్లోరిఫైరిపాస్ కలిపి పిచికారీ చేయాలన్నారు.
- పత్తి పంటలో రసంపీల్చు పురుగులు ఆశించే అవకాశం ఉందని, తొలి దశలో లీటర్ నీటికి 5 మి.లీ వేపనూనె లేదా 5 శాతం వేపగింజల కషాయాన్ని కలిపి పిచికారీ చేయాలన్నారు. తెల్లదోమ ఉధృతిని గమనించేందుకు ఎకరాకు 10 చొప్పున పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలన్నారు. వీటి నివారణకు లీటర్ నీటికి 0.4 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ లేదా 0.2 గ్రాములు థయోమిథాక్సామ్ లేదా 0.2 గ్రాములు అసిటామిప్రిడ్ కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు.

తుంగభద్రపై చివరి వరకూ ఆశలు

- టీబీ డ్యామ్‌కు 172 టీఎంసీల నీటి లభ్యతపై అంచనా
- లెక్కలు తేల్చిన బోర్డు అధికారులు
- ఆశలు పెంచుకుంటున్న హెచ్చెల్సీ ఆయకట్టు రైతులు
- ఈ నెల 20 లోపు నీటి విడుదలకు కార్యాచరణ



టీబీ డ్యామ్‌లో చేరిన నీరు



చెర్లోపల్లి వద్ద హెచ్చెల్సీలో సాగుతున్న యూటీ పనులు

రాయదుర్గం: కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల జీవనాడిగా ఉన్న తుంగభద్ర జలాశయంపై హెచ్చెల్సీ చివరి ఆయకట్టు రైతులూ ఆశలు పెట్టుకున్నారు. గతేడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా తుంగభద్ర బేసిన్‌లో కనిష్ట వర్షపాతం నమోదైంది. దీంతో అప్పట్లో జలాశయంలో 114.58 టీఎంసీల వరకు మాత్రమే నీరు చేరింది. ఇందులో తాగునీటి అవసరాలకు పోను 16.07 టీఎంసీలను హెచ్చెల్సీ వాటాగా కేటాయించారు. ఫలితంగా రాయదుర్గం హెచ్చెల్సీ సబ్‌డివిజన్ పరిధిలోని బొమ్మనహాళ్ నుంచి తాడిపత్రి వరకూ 70 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వచ్చింది. నీటి కొరత దృష్ట్యా అప్పట్లో ఎక్కువగా ఆరుతడి పంటలతోనే రైతులు సరిపెట్టుకున్నారు. ఈ ఏడాది నైరుతి ప్రభావంతో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందస్తుగా ప్రకటించింది. దీంతో కర్ణాటక, ఏపీ, తెలంగాణ ఇంజినీరింగ్ అధికారులు ఇటీవల టీబీ బోర్డు కార్యాలయంలో సమావేశమై నీటి లభ్యత, పంపకాలపై చర్చించారు. డ్యామ్‌లోకి గతం కంటే ఎక్కువగా 172 టీఎంసీల నీరు చేరుతుందనే అంచనాకు రావడంతో ఈ ఖరీఫ్‌లో హెచ్చెల్సీ వాటాగా 26.36 టీఎంసీల నీటిని కేటాయిస్తూ ప్రాథమిక అంచనాలు రూపొందించారు. దీంతో చివరి ఆయకట్టు రైతులూ ఈ సారి వరి సాగుపై దృష్టి సారిస్తున్నారు.

20వ తేదీ నీటి విడుదల?

బోర్డు సమావేశంలో పలు అంశాలపై అధికారులు తీర్మానాలు చేశారు. ఈ ఏడాది హెచ్చెల్సీ చివరి ఆయకట్టు వరకూ నీటిని అందించాలని, ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే వాతావరణం అనుకూలిస్తే ఈ నెల 15వ తేదీలోపు జలాశయం 170 టీఎంసీల నీటి మట్టానికి చేరుకోవచ్చునని అంచనా వేశారు. ఇదే నిజమైతే ఈ నెల 20వ తేదీని హెచ్చెల్సీకి నీటి విడుదలకు అవసరమైన కార్యాచరణనూ రూపొందించారు. ఈ క్రమంలోనే గతేడాది దెబ్బతిన్న ప్రధాన కాలువకు తాత్కాలిక మరమ్మతులు మొదలుపెట్టారు.

7.909 టీఎంసీలకు చేరిన నీరు

గత పది రోజులుగా తుంగభద్ర డ్యామ్‌లోకి మందకొడిగా ఇన్‌ఫ్లో కొనసాగింది. జలాశయం ఉపరితలంలో విస్తారంగా వానలు మొదలు కావడంతో గత నాలుగు రోజులుగా ఆశించిన స్థాయి కంటే ఎక్కువగా ఇన్‌ఫ్లో మొదలైంది. దీంతో రెండు రోజుల్లోనే రెండు టీఎంసీలకు పైగా వరద చేరింది. డ్యామ్ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, మంగళవారం నాటికి 7.909 టీఎంసీలకు నీటి మట్టం చేరుకుంది. 13,410 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉందని బోర్డు అధికారులు తెలిపారు.

చివరి ఆయకట్టుకూ నీరు

టీబీ బోర్డు తీర్మానానికి అనుగుణంగా ఈ ఏడాది 172 టీఎంసీలు డ్యామ్‌లోకి చేరితే హెచ్చెల్సీ వాటాగా 26.36 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు వీలవుతుంది. జలాశయంలోకి నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో ముందస్తు కార్యచరణకు శ్రీకారం చుట్టాం. ఈ నేపథ్యంలో యూటీ, కాలువ మరమ్మతు పనులు చేపట్టాం. చివరి ఆయకట్టుకూ సమృద్ధిగా నీరందించేలా చర్యలు తీసుకున్నాం.

– రమణారెడ్డి, హెచ్చెల్సీ ఈఈ, అనంతపురం